RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:101 | ఏప్రిల్ 04, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



## వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ రైడ్స్

- కోట్ల లావాదేవీలపై దర్యాప్తు
- అధికారుల ఇండ్లలో భారీగా నగదు స్వాధీనం

2లో



## పురుగుల మందు తాగిన సర్పంచ్..

ఆస్పత్రికి తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం..

- సమయానికి చికిత్స అందక మృతి
- నిర్మల్ జిల్లాలో తీవ్ర విషాదం

2లో

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఇద్దరు మృతి.. ఒకరికి గాయాలు
- కరీంనగర్ శివారులోని బైపాస్ రోడ్డుపై ఘటన

2లో






# భోజనాలకు రూ. 16 లక్షలట!!

జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ఖర్చుల్లో భారీ స్కామ్

2లో

### అధికారుల అండతో రూ. 60 లక్షలు పక్కదారి..

- వాస్తవానికి మించి ఖర్చులను చూపిస్తూ..
- ప్రభుత్వ సొమ్ముకు కన్నం పెట్టిన ఘనులు
- విచారణలో వెలుగు చూసిన అవినీతి చిట్టా
- ప్రజల్లో వెల్లువెత్తుతున్న నిరసన
- అక్రమార్కులపై వేటుకు ప్రభుత్వం సిద్ధం

**వేద న్యూస్, జగిత్యాల**

తిన్నది సాదాసీదా బువ్వే.. కానీ బిల్లులు మాత్రం ఫైవ్ స్టార్ రేంజ్ లో! ఒక్క ఎన్నికల భోజనానికే అక్షరాలా 16 లక్షల రూపాయల ఖర్చు చూపించి.. మొత్తం మీద 60 లక్షల ప్రజా ధనాన్ని మున్సిపల్ అధికారులు పక్కదారి పట్టించిన వైనం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. అధికారుల అండదండలతో కాంట్రాక్టర్లు కలిసి ఆడిన ఈ అవినీతి నాటకం అకౌంట్స్ విభాగం తనిఖీల్లో బట్టబయలైంది. అసలు సరఫరా చేయని వస్తువులకు సైతం దొంగ బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసిన ఈ వ్యవహారంలో.. ఇప్పుడు పెద్ద తలకాయల గుట్టు తేల్చేందుకు ఉన్నతాధికారులు విచారణకు రంగం సిద్ధం చేశారు.

# దేవాలయంలో దోపిడీ పర్వం!

రాజక్కపేట ఎల్లమ్మ ఆలయంలో అక్రమ వసూళ్లు



- భక్తుల విశ్వాసంతో ఒగ్గు పూజారుల వ్యాపారం
- పూజల పేరుతో వేలల్లో వసూళ్లు..
- కొబ్బరికాయ కొట్టడం నుంచి మేక పోతు వరకు ప్రతి దానికి రేటే..
- డబ్బులివ్వకపోతే భక్తులపై అసభ్య పదజాలం
- కనీస భక్తిశ్రద్ధలు లేకుండా సాగుతున్న పట్నం పూజలు
- ఆదాయం వస్తున్నా కనీస వసతులు కరువు
- కలెక్టర్ జోక్యం చేసుకుని ఆలయ పవిత్రతను కాపాడాలంటున్న భక్తులు

2లో

**వేద న్యూస్, దుబ్బాక**

దేవుడి సేవలో తరించాల్సిన చోట.. కాసుల వేట సాగుతోంది! భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని అక్షరాలా దక్షిణ దోపిడీకి తెరలేపారు కొందరు కేటుగాళ్లు. దుబ్బాక మండలం రాజక్కపేటలోని ఎల్లమ్మ ఆలయం ఇప్పుడు ఆధ్యాత్మిక కేంద్రం కంటే.. అక్రమ వసూళ్ల అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్నం వేయాలన్నా, పిల్లాపాపలతో మొక్కులు తీర్చుకోవాలన్నా వేల రూపాయలు సమర్పించుకోవాల్సిందే! అడిగినంత ఇచ్చుకోకపోతే పూజలు మధ్యలోనే ఆపేయడమే కాకుండా.. భక్తులపై అసభ్య పదజాలంతో విరుచుకుపడుతున్న ఒగ్గు పూజారుల ఆగడాలపై ఇప్పుడు జిల్లావ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది.

## 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం




- వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు
- గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లు, మహిళా సాధికారతకు పెద్దపీట
- ఏటెక్స్‌కాన్-2026లో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

నగరంలోని హైటెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం మరియు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహించిన 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సును ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అటెక్స్‌కాన్-2026 ప్రత్యేక నివేదికను విడుదల చేసి, అక్కడ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియాలోనే అత్యుత్తమ టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. వస్త్ర పరిశ్రమ తెలంగాణ ప్రజల డీఎన్ఏలోనే ఉందని, శతాబ్దాలుగా కళలు, సంస్కృతి ఇక్కడ వస్త్ర రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయని ఆయన కొనియాడారు. తెలంగాణలో పత్తి ఉత్పత్తి మరియు నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, ఇది కేవలం ఒక పరిశ్రమ

...మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

శనివారం | ఏప్రిల్ 04, 2026

# యువతలో రాజకీయ పవనాలు

యువత రాజకీయాల్లోకి రావాలని, పాలితులుగా ఉండకుండా పాలకులుగా వారు ఎదగాలని ప్రతీ ఒక్కరూ ఆకాంక్షిస్తారు. కానీ, ఆచరణలో ఆ దిశగా యూత్‌ను చైతన్య పరిచి రాజకీయ రంగంలో వారు ముందుకు సాగేలా ప్రోత్సహించే వారు కొద్ది మందే. ముఖ్యంగా యువతలో రాజకీయ చైతన్యం నింపుతూ.. తమదైన గమ్యం చేరుకునేలా ప్రోత్సాహం అందించడం కీలకం. ఆ దిశగా వారి అడుగులు పడేలా ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన వంతు ప్రోత్సాహం ఇస్తున్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తన జనసేన పార్టీలో యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. సంప్రదాయ రాజకీయ పార్టీలకు ఉండే భావజాలానికి భిన్నంగా తన పార్టీలో జనసైనికులకు తమదైన పంథాలో ప్రయాణం కొనసాగించేలా దిశానిర్దేశం చేస్తున్నారు. ఫలితంగా యువతలో రాజకీయ చైతన్యం పెరుగుతున్నది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో పొలిటికల్‌గా జర్నీ చేయాలని యువతీ యువకులు నడుం బిగుస్తున్నారని చెప్పొచ్చు. జనసేన పార్టీలో జనసైనికులుగా తమ రాజకీయాన్ని షురూ చేయాలనే యువత పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నది.



....అయితే, పవన్ తనదైన శైలిలో స్వయం ప్రకాశితుడిగా, పడి లేచిన కెరటంలా రాజకీయ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఆయన భాషలోనే మరో మాటలో చెప్పాలంటే.. 'ఎక్కడ నెగ్గాలో కాదు..ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడు గొప్పవాడు' అనే సినీ డైలాగ్‌ను రియల్ లైఫ్‌లోనూ పవన్ ఫాలో అవుతున్నట్లున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని అందులో.. బలమైన భావజాలం, సిద్ధాంతం, దేశం పట్ల ప్రేమతో, దేశభక్తితో కూడిన పార్టీగా ఉన్న జనసేనలోకి యువత పెద్ద ఎత్తున రావాలని.. నవ భారత నిర్మాణానికి అడుగులు పడాలని ఆశిస్తున్నా.

### విలక్షణ శైలి పవన్ సొంతం

అధికార వికేంద్రీకరణ, పర్యావరణ పరిరక్షణ, సుపరిపాలన వంటి అంశాలతో పాటు దేశభక్తి గురించి నినదించే నాయకుడిగా పవన్ పేరు సంపాదించుకున్నారు. ముఖ్యంగా యువత అభిమానించే లీడర్‌గా పవన్ ఎమర్జ్ అయ్యారు. భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగానూ ఆయన సినీ నటుడిగా ఫుల్ ఫేమస్. గూగుల్‌లో ఆయన గురించి నెటిజన్లు ఎక్కువగా సెర్చ్ చేయడంతో గూగుల్ పాపులర్ పర్సన్‌గా యాక్టర్స్ కేటగిరీలో రికార్డుకెక్కారు. ఇక దేశంలో.. తెలుగు రాష్ట్రాలలోనే కాదు ఆ మాటకొస్తే.. దక్షిణాదియే కాదు.. యావత్ భారతదేశంలోనూ ఆయనకు పలుకుబడి ఉంది. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లు ఆయనకొక 'తుఫాను'లాగా ముందు కెళ్లగలరు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్‌తో దేశరాజకీయాల్లో ఆయన చరిత్ర సృష్టించారు.

### దేశభక్తికి మారుపేరు

'అంత కలిపి నేను పిడికెడు మట్టే కావచ్చు. కానీ నేను ఒకసారి తలెత్తి చూస్తే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరుంది' అంటూ అశేష అభిమానులను ఉద్దేశించి పవన్ చెప్పే మాటలు ప్రతీ ఒక్కరిలో ఉత్సాహాన్ని , దేశభక్తిని నూరిపోస్తాయి. ముఖ్యంగా యువతను ఉద్దేశించి.. 'కలలు కను' అంటూ గుంటూరు శేషేంద్ర శర్మ, బాలగంగాధర్ తిలక్ కవితలను ఉటంకిస్తూ.. భావోద్వేగంతో పవన్ చెప్పే మాటల యువతను ఉత్తేజితం చేస్తున్నాయి. ప్రస్తుతం పాలనాపరంగా డిప్యూటీ సీఎంగా సేవలందిస్తూనే.. నటనాపరంగానూ కుదిరినంతలో సినిమాలు చేస్తూ.. ఒకే సమయంలో నటుడిగానూ, నాయకుడిగానూ.. జోడు గుర్రాల మీద స్వారీ చేస్తూ.. ప్రజల్లో ఉన్నారు. జనసేన అధినేతగా ఉన్న పవన్ కల్యాణ్.. ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి అత్యంత ఆత్మీయుడిగా ఉన్నారు. ఆయన భవిష్యత్తులో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు మెండుగానే కనిపిస్తున్నాయి. ఆయన తనను తాను తెలుగు రాష్ట్రాలకే పరిమితం చేసుకోకుండా దక్షిణ భారతదేశంతో పాటు ఉత్తర భారతంలోని వివిధ అంశాలపైన మాట్లాడటం చూస్తుంటే.. యువతలో రాజకీయ చైతన్యం కలిగించేలా.. వారికి జనసేనను ఒక రాజకీయ వేదికగా అందించేందుకు గేట్లు తెరిచే ఉంచినట్లు స్పష్టమౌతున్నది. ఇక దక్షిణ భారతాన అయితే ఇప్పటికే పలువురు సినీ నటులు వెండితెరను వదిలి రాజకీయ రణరంగాన సంచలనాలు సృష్టించారు. ఆ కోవకు చెందిన నాయకుడిగా పవన్ కల్యాణ్ నిలిచారు. అయితే, పవన్ తనదైన శైలిలో స్వయం ప్రకాశితుడిగా, పడి లేచిన కెరటంలా రాజకీయ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఆయన భాషలోనే మరో మాటలో చెప్పాలంటే.. 'ఎక్కడ నెగ్గాలో కాదు..ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడు గొప్పవాడు' అనే సినీ డైలాగ్‌ను రియల్ లైఫ్‌లోనూ పవన్ ఫాలో అవుతున్నట్లున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని అందులో.. బలమైన భావజాలం, సిద్ధాంతం, దేశం పట్ల ప్రేమతో, దేశభక్తితో కూడిన పార్టీగా ఉన్న జనసేనలోకి యువత పెద్ద ఎత్తున రావాలని.. నవ భారత నిర్మాణానికి అడుగులు పడాలని ఆశిస్తున్నా.



లింగబత్తిని కృష్ణ
సీనియర్ జర్నలిస్ట్
సెల్:9701923260

## పురుగుల మందు తాగిన సర్పంచ్

- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- సమయానికి చికిత్స అందక మృతి
- నిర్మల్ జిల్లాలో తీవ్ర విషాదం

**వేద న్యూస్, కడెం**

నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట గ్రామ సర్పంచ్ లహరి ఆత్మహత్యాయత్నం చేయడం.. ఆపై ఆసుపత్రికి తరలిస్తుండగా జరిగిన ప్రమాదంలో ఆమె ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా కలకలం రేపుతోంది. మాసాయిపేట సర్పంచ్ లహరి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కారులో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. లహరిని తీసుకువెళ్తున్న కారు వేగంగా వెళ్తూ మార్గమధ్యలో అదుపు తప్పింది. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్ నాగళ్లను కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో కారు తీవ్రంగా దెబ్బతినగా.. లహరి పరిస్థితి మరింత విషమించింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలు విడిచారు. ఒకే రోజు అటు ఆత్మహత్యాయత్నం, ఇటు రోడ్డు ప్రమాదం జరగడంతో మాసాయిపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. సర్పంచ్ లహరి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలేంటి? ప్రమాదం ఎలా జరిగింది? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు..

- ఇద్దరు మృతి.. ఒకరికి గాయాలు
- కరీంనగర్ శివారులోని బైపాస్ రోడ్డుపై ఘటన

**వేద న్యూస్, కరీంనగర్**

కరీంనగర్ శివారులోని బైపాస్ రోడ్డుపై అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలో నిలిపి ఉన్న లారీని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో కారు నుజ్జునుజైన ఘటనలో సయ్యద్ అబ్దుల్ రెహమాన్, సయ్యద్ అతియాబ్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో అతన్ని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇంకొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల

## ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

మాత్రమే కాకుండా లక్షలాది మందికి జీవనాధారమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ నుండి గద్వాల చీరల వరకు, వరంగల్ దుర్రీస్ నుండి నారాయణపేట చేనేత వరకు ప్రతిదీ రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని చెప్పారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉందని, పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం వేగంగా కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. పారదర్శకమైన విధానాల ద్వారా అనుమతులను వేగవంతం చేస్తామని ఆయన పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ద్వారా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని మార్చడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. కేవలం ఫ్యాషన్ మాత్రమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

## దేవాలయంలో 'దోపిడీ' పర్వం!

**వేద న్యూస్, దుబ్బాక**

ఆధ్యాత్మికతకు నిలయంగా, భక్తుల నమ్మకానికి కేంద్రంగా ఉండాల్సిన దేవాలయం ఇప్పుడు వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో కొలువైన రెగులకుంట ఎల్లమ్మ తల్లి, మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. మొక్కులు తీర్చుకోవడానికి వస్తున్న భక్తులను ఆశీర్వదించాల్సిన వారే, దక్షిణ పేరుతో అందినకాడికి దండుకుంటూ భక్తిని వ్యాపారంగా మార్చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### పట్నం వేయాలంటే వేల రూపాయలు..

ఆలయానికి వచ్చే భక్తుల ఆరోపణల ప్రకారం.. ఇక్కడ ప్రతి అడుగుకూ ఒక ధర నిర్ణయించారు. పట్నం వేయాలంటే రూ. వేయి నుంచి రూ.3వేలు వరకు వసూలు చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు.

పూజలు ప్రారంభించడానికి రూ.200, మేకను కోయడానికి రూ.100 నుండి రూ.200, కనీసం ఒక కొబ్బరికాయ కొట్టాలన్నా రూ.50 నుండి రూ.100 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత మొత్తం చెల్లించినా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించకుండా, కేవలం పట్నం వేసి అక్కడ ఉన్న పిండి, పచ్చ ప్రసాదాలను తీసుకుపొమ్మని అరకొర పూజలతోనే పంపిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### డబ్బులివ్వకపోతే పట్నం మధ్యలోనే వదిలేసి..

ఆలయంలో పనిచేసే ఒగ్గు పూజారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే పట్నం వేయడం మధ్యలోనే ఆపేసి వెళ్లిపోవడమే కాకుండా, డబ్బులు లేకపోతే గుడికి ఎందుకు వచ్చావు? అంటూ భక్తులపై అసభ్య పదజాలంతో విరుచుకుపడుతున్నారని సమాచారం. హుండీ ద్వారా వచ్చే ఆదాయం కంటే, అక్కడ పనిచేసే వ్యక్తులు చేసే వసూళ్లే ఎక్కువగా ఉన్నాయని భక్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కనీస విశ్రాంతి సౌకర్యాలు లేని ఈ ఆలయంలో, ఒగ్గు వ్యక్తుల ఒత్తిడి భక్తులకు నరకం చూపిస్తోంది.

- రాజక్కపేట ఎల్లమ్మ ఆలయంలో అక్రమ వసూళ్లు
- భక్తుల విశ్వాసంతో ఒగ్గు పూజారుల వ్యాపారం
- పూజల పేరుతో వేలల్లో వసూళ్లు..
- కొబ్బరికాయ కొట్టడం నుంచి మేక పోటు వరకు ప్రతి దానికి రేటే..
- డబ్బులివ్వకపోతే భక్తులపై అసభ్య పదజాలం
- కనీస భక్తిశ్రద్ధలు లేకుండా సాగుతున్న పట్నం పూజలు
- ఆదాయం వస్తున్నా కనీస వసతులు కరువు
- కలెక్టర్ జోక్యం చేసుకుని ఆలయ పవిత్రతను కాపాడాలంటున్న భక్తులు

### అధికారులు స్పందించాలి..

దేవాలయంలో సాగుతున్న ఈ దోపిడీ పర్వం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం వెంటనే స్పందించి, సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయకపోతే, భక్తులకు ఉన్న నమ్మకం క్రమంగా సడలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## భోజనాలకు రూ. 16 లక్షలట!!

### అధికారుల అండతో రూ. 60 లక్షలు పక్కదారి..

- వాస్తవానికి మించి ఖర్చులను చూపిస్తూ..
- ప్రభుత్వ సొమ్ముకు కన్నం పెట్టిన ఘనులు
- విచారణలో వెలుగు చూసిన అవినీతి చిట్టా
- ప్రజల్లో వెల్లువెత్తుతున్న నిరసన
- అక్రమార్కులపై వేటుకు ప్రభుత్వం సిద్ధం

**జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ఖర్చుల్లో భారీ స్కామ్**




**వేద న్యూస్, జగిత్యాల**

జగిత్యాల జిల్లా మున్సిపాలిటీల్లో అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ పేరుతో ప్రజాధనాన్ని అధికారులు ఏ విధంగా పక్కదారి పట్టించారో విచారణలో దిగ్భ్రాంతికర నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి భోజనాలు, టీ, టిఫిన్ల పేరుతో అక్షరాలా రూ. 16 లక్షల బిల్లులు సృష్టించడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా రూ. 60 లక్షల వరకు ఎన్నికల ఖర్చుల్లో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### తిన్నది తక్కువ.. బిల్లులు ఎక్కువ

ఎన్నికల నిర్వహణలో భాగంగా సిబ్బందికి అందించిన భోజన ఖర్చులను రికార్డుల్లో అత్యంత కృత్రిమంగా పెంచి చూపినట్లు తెలుస్తోంది. ఒక్కో వ్యక్తికి రోజుకు రూ. 150 చొప్పున, వరుసగా 6 రోజుల పాటు భోజనాలు సరఫరా చేసినట్లు లెక్కలు రాశారు. ఈ లెక్కన కేవలం భోజనాలకే రూ. 16 లక్షలు ఖర్చయినట్లు బిల్లులు సమర్పించారు. అయితే, వాస్తవానికి క్షేత్రస్థాయిలో జరిగిన ఖర్చుకు, రికార్డుల్లో ఉన్న మొత్తానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్కువ ధరకే దొరికే సాదా సీదా వంటలు వడ్డించి, ఫైవ్ స్టార్ రేంజ్ బిల్లులు వసూలు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### తనిఖీల్లో అనేక అక్రమాలు..

అకౌంట్స్ విభాగం నిఘాలో అసలు రంగు బయటపడింది ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు అనుమానం రావడంతో అకౌంట్స్ విభాగం ద్వారా నిశితంగా పరిశీలన జరిపించారు. తనిఖీల్లో అనేక వ్యత్యాసాలు బయటపడ్డాయి. కొంతమంది సరఫరాదారులు అధికారుల అండదండలతో కావాలనే బిల్లులను పెంచి చూపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అసలు సరఫరా చేయని వస్తువులకు కూడా బిల్లులు పెట్టి ప్రభుత్వ ఖజానాకు కన్నం వేశారని సమాచారం.

### బాధ్యులపై వేటు తప్పదు

ఈ భారీ అవినీతి దందాపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఇప్పటికే సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులు, అకౌంట్స్ సిబ్బంది, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విచారణ పూర్తయితే ఈ కుంభకోణంలో మరిన్ని పెద్ద తలకాయల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది.

వరంగల్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో

## ఏసీబీ దాడులు

**వేద న్యూస్, వరంగల్**

వరంగల్ జిల్లా హనుమకొండలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు అక్రమాలు వెలుగులోకి రావడంతో అధికార వర్గాల్లో కలకలం రేగింది. ఈ తనిఖీల్లో కార్యాలయం లోపల 20 మంది అనధికార ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా లెక్కల్లో చూపని రూ.47,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ కాని 70 పత్రాలు కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య భారీ లావాదేవీలు జరిగినట్లు వాట్సాప్ చాట్‌ల ద్వారా బయటపడింది. గత ఏడాదిలో రూ.42.03 లక్షల వరకు ఫోన్‌పే ద్వారా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. అలాగే రిజిస్టర్ చేసిన 204 పత్రాలు ఇంకా సంబంధిత వారికి అందించకుండా కార్యాలయంలోనే నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ అంశంపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఇక అధికారుల ఇళ్లలో నిర్వహించిన తనిఖీల్లో రూ.24.61 లక్షల నగదు, 819.5 గ్రాముల బంగారం, 2.6 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా రూ.30.1 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించారు.

# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

**వేద న్యూస్, మెట్‌పల్లి:**



మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నిర్మూలన కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య సాధారణ గొర్లకాపరి కుటుంబంలో జన్మించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి సామాన్య ప్రజలకు విముక్తి సాధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, వీడీసీ చైర్మన్, కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

**వేద న్యూస్, చొప్పదండి :**



చొప్పదండి పట్టణంలో కురుమ యువజన సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, విప్లవ వీరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు జిట్ట కుమార్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం పోరాడిన కొమురయ్య ఆశయాలను యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. అలాగే దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాదులోని ట్యాంక్ బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుంటి రాజశేఖర్, లస్మయ్య, రాజయ్య, మల్లయ్య, రాజమల్లు, తిరుపతి, కనుకయ్య, మునేష్, శ్రీనివాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- ఐడీఓసీలో ఘనంగా జయంతి వేడుకలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తికి ప్రతీక అని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, కొమురయ్య పోరాటం సామాన్య ప్రజల హక్కుల కోసం సాగినదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి శరత్, ఎగుట్ల కనకయ్య, నాగం కుమార్, చిమల్ల మల్లేశం, స్తంబ లచ్చయ్య, వేముల నాగరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా సీతారాముల గరుడ సేవ

- తొమ్మిది రోజుల రథోత్సవం ప్రారంభం




**వేద న్యూస్, గంభీరావుపేట:**

తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాములవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సీతారాముల కళ్యాణం అనంతరం నిర్వహించే తొమ్మిది రోజుల రథోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. మల్లు గారి పద్మ సర్పంచ్ నర్సా గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గరుడ సేవ విశేషంగా ఆకట్టుకుంది. ప్రతిరోజు స్వామివారిని భిన్నమైన వాహనాలపై అలంకరించి గ్రామమంతా ఊరేగిస్తున్నారు. ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు సమిష్టిగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. పచ్చని తోరణాలు, రంగురంగుల పూలమాలలతో అలంకరించిన స్వామివారిని వీధి వీధి ఊరేగింపుగా తీసుకెళ్తుండగా, గ్రామం మొత్తం భక్తులతో కిక్కిరిసింది. మహిళలు మంగళహారతులు అందిస్తూ భక్తి భావాన్ని చాటారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆలయం కాకతీయుల కాలానికి చెందిన చారిత్రక కట్టడం. సుమారు 700 ఏళ్ల చరిత్ర కలిగిన గరుడ దీపం, గర్భగుడిలో 16 స్తంభాలు, ఆలయ ఆవరణలో మరో 16 స్తంభాలతో నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పురాణాల ప్రకారం ఇక్కడ కొలువై ఉన్న సీతారాముల వారు కోరుకున్న కోరికలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందారు. రైతులు, వ్యాపారస్తులు, గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఆరాధిస్తున్నారు. శ్రీరామ నవమి నుండి ప్రారంభమైన ఈ రథోత్సవం శనివారం వరకు కనుల పండుగగా కొనసాగనుంది. భక్తజన సమూహంతో గంభీరావుపేట ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

# ‘డంపింగ్ యార్డ్’ బంద్ విజయవంతం

- స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన ప్రజలు, వ్యాపారులు
- కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ
- 12వ రోజుకు చేరిన నిరసనలు



**వేద న్యూస్, హుజురాబాద్ :**

హుజురాబాద్ పట్టణంలో వేస్ట్ టు ఎనర్జీ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపుతో చేపట్టిన ఈ బంద్‌కు ప్రజలు, వ్యాపారులు విస్తృతంగా స్పందించారు. శుక్రవారం ఉదయం ప్రారంభమైన బంద్‌లో భాగంగా పట్టణంలోని దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. నిత్యావసర సేవలు మినహా మిగతా అన్ని రంగాలు బంద్‌లో




పాల్గొన్నాయి. పెట్రోల్ బంకులు సైతం మూసివేసి నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ డంపింగ్ యార్డ్ వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సిరసపల్లి శివారులో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు 12వ రోజుకు చేరుకున్నాయి. అంబేద్కర్ చౌరస్తాలో నిరసనకారులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా ఉన్న ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. పట్టణంలోని కీలక ప్రాంతాల్లో బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షించారు. మొత్తంగా ప్రజలు, వ్యాపారులు ఒకే తాటిపైకి వచ్చి బంద్‌ను విజయవంతం చేయడంతో ప్రభుత్వం డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని పునరాలోచించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ దందాలు చేస్తే ఫిర్యాదు చేయండి

- ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవు
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**వేద న్యూస్, కరీంనగర్ :**



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో తన పేరు చెప్పి ఎవరైనా కబ్జాలు, అక్రమ దందాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు. ఎవరైనా తన పేరును ఉపయోగించి పంచాయతీలు, సెటిల్‌మెంట్ల పేరుతో ప్రజలను ఇబ్బంది పెడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కూడా ఇలాంటి పైరవీకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలకు సేవ చేస్తూ పార్టీకి మంచి పేరు తీసుకురావాలని, అదే సమయంలో ప్రజలను వేధించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ఇకపై తన పేరు చెబుతూ సామాన్యులను ఇబ్బంది పెట్టే ఘటనలు ఎదురైతే వెంటనే ఎంపీ కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

# నాణ్యమైన విద్యుత్ సేవలే లక్ష్యం

- విభాగపు ఇంజనీర్ అంజయ్య

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి:**



వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని సిరిసిల్ల విభాగపు ఇంజనీర్ అంజయ్య తెలిపారు. బి. బిక్షపతి ఆదేశాల మేరకు శుక్రవారం గంభీరావుపేట మండలం పరిధిలోని ముస్తాబాద్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, నిర్వహణ మరియు పర్యవేక్షణ (ఓ అండ్ ఎం) సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి కార్యాచరణ, వ్యవసాయ సర్వీసుల మంజూరు, విద్యుత్ భద్రత అంశాలపై విస్తృతంగా చర్చించారు. వేసవి కాలంలో విద్యుత్ లోడ్ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని అంజయ్య సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, ప్రమాదకర లైన్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టడం, వంగిన విద్యుత్ స్తంభాలను తక్షణమే మార్చడం వంటి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, ఎర్త్ రాడ్ వంటి భద్రతా పరికరాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో గంభీరావుపేట సహాయ విభాగపు ఇంజనీర్ శ్రీనివాస్, సహాయ ఇంజనీర్ విష్ణు తేజ, నిర్వహణ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా వీరనాగమ్మ మాత కల్యాణ మహోత్సవం

- అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలి
- తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి

**వేద న్యూస్, షాద్నగర్:**

కేశంపేట మండలం పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ వీరనాగమ్మ మాత కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ మహోత్సవంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మంగళహారతులు అందించారు. ఈ కార్యక్రమంలో త్రిప్పిశెట్టి సుదర్శన్, డిప్యూటీ సర్పంచ్, వార్డు సభ్యులు, కర్నెకోట వంశ భక్త బృందం సభ్యులు, గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 04, 2026

# చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ

## - రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ నగరంలోని చెరువుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగసముద్రం చెరువులలో రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన ఈ పనులు పూర్తయ్యే సరికి చెరువుల పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పెరుగుదల, పర్యావరణ సంరక్షణ, నగర సౌందర్యం మెరుగుపడుతాయని మంత్రి పేర్కొన్నారు. చెరువులను శుభ్రపరచి, ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఉర్సు రంగసముద్రం చెరువు మరియు దేశాయిపేట చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. నగరంలోని వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి మేయర్, కమిషనర్, కలెక్టర్ల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 5 గ్యారంటీల అమలు జరుగుతోందని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, సిఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం, రూ.5 లక్షల ఉచిత జీవన బీమా వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఉన్నాయని తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్ నేపథ్యంలో మహిళలకు కుట్టు యంత్రాలపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందించడం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డా. సత్య శారద, చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు సురేష్ జోషి, మరుపల్ల రవి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బోటు ప్రయాణాల్లో లైఫ్ జాకెట్లు తప్పనిసరి

## - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
## - పర్యాటక శాఖ అధికారుల హెచ్చరిక

**వేద న్యూస్, అచ్చంపేట్:**

తెలంగాణలోని సోమశిల నుండి ఆంధ్రప్రదేశ్‌లోని సంగమేశ్వరం వరకు పర్యాటకుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మరియు గ్రామ సర్పంచ్ కాటం వెంకటలక్ష్మి వెంకటస్వామి బోటు సేవలను పరిశీలించారు. పర్యాటకులు లైఫ్ జాకెట్లు లేకుండా ప్రయాణిస్తున్నట్లు గమనించిన అధికారులు వెంటనే స్పందించి, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలని ఆదేశించారు. లైఫ్ జాకెట్లు లేకుండా ఉన్న పర్యాటకులను బోట్లలో అనుమతించవద్దని టూరిస్ట్ పోలీసులకు సూచించారు. అదేవిధంగా, బోటు యజమానులు పర్యాటకులకు ఎల్లప్పుడూ సరిపడా లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని, బోట్ల సామర్థ్యానికి మించి



ప్రయాణికులను ఎక్కించవద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టూరిస్ట్ కానిస్టేబుళ్లు శివ శంకర్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

# నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

## - వినియోగదారుల మన్ననలను పొందాలి
## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**వేద న్యూస్, చర్లపల్లి :**

వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి మన్ననలను పొందాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ జైల్ సమీపంలో శ్రీరామ్ ఫుడ్స్ అండ్ రెస్టారెంట్ ను మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, కొత్త రామారావు పజ్జూరి పావని రెడ్డి, పొన్నాల దేవేందర్ రెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై ఆధార పడకుండా సొంత నిధులతో ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్న శ్రీరామ్ బేకర్స్ స్వీట్స్ ఫుడ్స్ రెస్టారెంట్ అధినేత కట్కూరి సుధా విజయ్ కుమార్ రెడ్డి లను ఈ సందర్భంగా అభినందించారు. మాజీమంత్రి మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ వ్యాపారంలో నాణ్యత, విశ్వాసం, వినియోగదారుల సంతృప్తి ఎంతో ముఖ్యమని తెలిపారు. మంచి ఆహారం, శుభ్రత, సరైన ధరలు ఉంటేనే వ్యాపారం దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గణేష్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మురళి పంతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె. సీతారాం రెడ్డి, చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఫౌండర్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, కీసర శ్రీ రామలింగేశ్వర దేవస్థానం చైర్మన్ తటాకం వెంకటేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్ రెడ్డి (కుషాయిగూడ), ఆర్కపల్లి ఆంజనేయులు (కీసర), సుధాకర్ (చర్లపల్లి) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు విజయ్ కుమార్ రెడ్డికి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ ప్రతిమను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త రెస్టారెంట్ ద్వారా స్థానికులకు మంచి నాణ్యమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సేవా స్ఫూర్తితో ముందుకు సాగుతున్న సర్పంచ్

**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజును అక్షరం ఆయుధం మీడియా బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. గ్రామ అభివృద్ధి దిశగా ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలను మీడియా మిత్రులు ప్రశంసించారు. గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు ప్రజల సంక్షేమాన్ని ముందుంచుకుని సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తీరు అభినందనీయమని తెలిపారు. సేవా దృక్పథంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన సర్పంచ్‌గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రజల సహకారంతో మరింత కృషి చేస్తానని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్షరం ఆయుధం మీడియా బృందం సభ్యులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా



## - కలెక్టర్ రాజర్షి షా

**వేద న్యూస్, అదిలాబాద్ :**

తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీ.ఎస్.జె.యు) జిల్లా నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షా నీ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్నీ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నుకొబడిన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్ ,ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న, ఉపాధ్యక్షులు పసుపుల స్వామి లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయడం తోపాటు హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేవిధంగా చూడాలని, అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు,ఇంటి స్థలాలు ఇవ్వవలసిందిగా కోరారు.దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను అని బరోసా ఇచ్చారు. యూనియన్ కోశాధికారి అమృత్, ఓకే ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షులు నరేష్ కదం, సహాయ కార్యదర్శి ఆర్క సంతోష్ తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎముర్లవార్, అనిల్ పవర్, అడ్డిగం మోహన్, శంకర్ తదితరులు ఉన్నారు.

# అస్తిత్వం కోల్పోయిన అమరచింతకు పునర్వైభవం సాధిద్దాం

## - మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి



**వేద న్యూస్, అమరచింత:**

రాబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో అమరచింతకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. అమరచింత నియోజకవర్గ అస్తిత్వం కోల్పోవడం ఈ ప్రాంత అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిందని ఆయన అన్నారు. శుక్రవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని దేశాయి మురళీధర్ రెడ్డి ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశాయి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, తాను ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా అమరచింత నియోజకవర్గ సాధన కోసం రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తానని తెలిపారు. ఒకప్పుడు ఉద్యమాల పురిటి గడ్డగా పేరొందిన అమరచింత తన రాజకీయ అస్తిత్వాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నియోజకవర్గ పునర్విభజనలో అమరచింత పరిధిలోని నర్వ, ఆత్మకూర్ మండలాలు మక్తల్ నియోజకవర్గంలో కలవగా, చింతకుంట మండలాలు దేవరకద్ర నియోజకవర్గంలో విలీనం కావడంతో ఈ ప్రాంత అభివృద్ధి, రాజకీయ ప్రాధాన్యం దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ఇకనైనా అమరచింత నియోజకవర్గాన్ని పునరుద్ధరించుకునేందుకు మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను ఒప్పించి సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. త్వరలోనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రజలను ఉద్యమంలో భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్, వైస్ చైర్మన్ జింక సువర్ణ రవి, రాధా అరుణ్, నర్సింలు గౌడ్, ఎస్.ఏ. రాజు, మంగ లావణ్య, మెరువ రాజు, ఎస్పీ రత్నం, మారుతి అశోక్, అబ్రహం, హనుమంతు, వెంకట్ రెడ్డి, కేజీ జైసింహారెడ్డి, జర్నలిస్టులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుడు సంభోజి శేఖర్ ఆకస్మిక మృతి

## - చొప్పదండి ప్రాంతంలో విషాద ఛాయలు



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలానికి చెందిన ప్రముఖ పాత్రికేయుడు సంభోజి శేఖర్ ఆకస్మికంగా మృతి చెందడంతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. సూర్య, వార్త పత్రికల్లో రిపోర్టర్‌గా సేవలందించిన శేఖర్ జర్నలిజం రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ నిబద్ధతతో పనిచేసిన నిజాయితీ గల పాత్రికేయుడిగా ఆయన పేరు గడించారు. నిన్న రాత్రి అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు అత్యవసరంగా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు హృదయ ఆగిపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. సుమారు 30 సంవత్సరాల పాటు వివిధ పత్రికల్లో సేవలందించిన ఆయన జర్నలిజం రంగానికి విశేష సేవలు చేశారు. శేఖర్ మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే సత్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇతర ప్రజాప్రతినిధులు, పాత్రికేయ సంఘాలు కూడా శేఖర్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశాయి. ఆయన మరణం జర్నలిజం రంగానికి తీరని లోటుగా భావిస్తున్నారు.

# చొప్పదండి అభివృద్ధికి మంజూరైన రూ.15 కోట్లు ఎక్కడ..?

**– మాజీ కౌన్సిలర్ మాదూరి శ్రీనివాస్ ప్రశ్న**



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణ అభివృద్ధికి మున్సిపల్ ఎన్నికల ముందు మంజూరైన రూ.15 కోట్ల నిధులపై స్పష్టత ఇవ్వాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు మాదూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు ప్రతి వార్డుకు రూ.50 లక్షల చొప్పున నిధులు మంజూరు అయ్యా యని ప్రకటిస్తూ శిలాఫలకాలు ఏర్పాటు చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించారని తెలిపారు. అయితే మూడు నెలలు గడిచినా పనుల్లో పురోగతి కనిపించడం లేదన్నారు. పట్టణంలోని 14 వార్డుల్లో కేవలం రెండు వార్డుల్లో మాత్రమే పనులు కొనసాగుతున్నాయని, మిగతా వార్డులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తయిందా లేదా అన్న సందేహం ప్రజల్లో నెలకొన్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా వంటి అభివృద్ధి కార్యక్రమాలు సమర్థంగా అమలు చేశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. మంజూరైన రూ.15 కోట్ల నిధులను వెంటనే వినియోగించి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, లేకపోతే ప్రజలను మభ్యపెడుతున్నారనే అనుమానాలు మరింత పెరుగుతాయని హెచ్చరించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్, స్థానిక నాయకులు తక్షణమే స్పందించాలని కోరారు.

# లక్ష్మీదేవి గుడిని పట్టించుకోని అధికారులు..!?

**– ఆలయ నిధులు దుర్వినియోగం**
**– మండిపడుతున్న చింతగూడ గ్రామస్థులు**



**వేద న్యూస్ , మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ లక్ష్మీదేవి దేవస్థానం నిర్వహణలో ఆలయ ఈవో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. భక్తుల నుండి ప్రతీఏటా లక్షలాది రూపాయల విరాళాలు కానుకలు వస్తున్నా ఆలయ ఈవో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని గ్రామసభలో గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు ఈవో పనితీరుకు వ్యతిరేకంగా గలమెత్తారు. ఆలయ నిధుల నుండి గ్రామాభివృద్ధికి వాటా కేటాయించాలని ముక్తకంఠంతో గ్రామస్థులంతా గ్రామసభలో నినదించారు. గత కమిటీ పదవీకాలం ముగిసి రెండేళ్ల కాలం గడుస్తున్నా ఆలయ కమిటీని ఏర్పాటు చేయకపోవడం శోచనీయం, సిగ్గుచేటు అని గ్రామ ప్రజలు మండిపడ్డారు.



**ఈవోను సస్పెండ్ చేయాలి : మేకల అక్షయ్ కుమార్ 2వ వార్డు సభ్యులు**

చింతగూడ గ్రామ పంచాయతీ చింతగూడ లక్ష్మీదేవి ఆలయ ఈవో చట్టాలను ఉల్లంఘిస్తున్నాడు. ఆలయ ఆదాయం లెక్కలు సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగినా, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశించినా గ్రామ ప్రజలకు బహిరంగంగా వెల్లడించడం లేదు. గ్రామపంచాయతీ గ్రామసభలకు వచ్చి గ్రామ ప్రజలకు సమాచారం ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా గ్రామసభలకు గైర్హాజరు అవుతున్నాడు. ఆలయ అభివృద్ధి పట్ల, పారిశుధ్య నిర్వహణపట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహారిస్తూ ఆలయ ప్రతిష్టను దిగజారుస్తున్నాడు. విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్న ఆలయ ఈవో ను తక్షణమే సస్పెండ్ చేయాలని గ్రామ ప్రజాప్రతినిధిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

# అడవి పంది దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

**– 108 సాయంతో ఆసుపత్రికి తరలింపు**



**వేద న్యూస్, జడ్చర్ల:**

జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామంలో అడవి పంది దాడిలో రైతు తీవ్రంగా గాయపడిన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ శుక్రవారం ఉదయం తన వ్యవసాయ పొలం లో పనులు చేసుకుంటుండ గా అకస్మాత్తుగా అడవి పంది దాడి చేసింది. ఈ దాడిలో ఆయన తీవ్ర ంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటుగా వెళ్తున్న ఇతర రైతులు ఘటనను గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి రామకృష్ణను చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, దాడి చేసిన అడవి పంది ఇంకా సమీపంలోని పొదల్లోనే సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పరిసర ప్రాంతాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

# డంప్ యార్డ్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోండి

**– ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డిని కోరిన ప్రణవ్ బాబు**

**వేద న్యూస్, హుజూరాబాద్:**

హుజూరాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి గ్రామ శివారులో ప్రతిపాదిత డంప్ యార్డ్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఓడితెల ప్రణవ్ బాబు కోరారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యుడు నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతం వ్యవసాయానికి ప్రధాన కేంద్రంగా ఉన్నందున డంప్ యార్డ్ ఏర్పాటు వల్ల రైతులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన వివరించారు. వేస్ట్ టు ఎనర్జీ యార్డ్ కారణంగా వ్యర్థాల ప్రభావం పంట పొలాలపై పడే ప్రమాదం ఉందని, ప్రజల ఆరోగ్యంపై కూడా దుష్ప్రభావం చూపవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య కాకుండా వేరే అనుకూల ప్రాంతంలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే ఈ విషయమై రెండోసారి ప్రభుత్వ సలహాదారుని కలిసినట్లు ప్రణవ్ బాబు తెలిపారు. డంప్



యార్డ్ ప్రతిపాదనపై ముందుకు వెళ్లకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన నరేందర్ రెడ్డి, సమస్యను పరిశీలించి చర్చిస్తామని భరోసా ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు

**– హెల్మెట్ ధారణపై ప్రత్యేక దృష్టి**
**– ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు సూచనలు**
**– బాపట్ల జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో కార్యక్రమం**

**వేద న్యూస్ బాపట్ల :**

బాపట్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా హెల్మెట్ ధారణ ప్రాముఖ్యతపై ప్రజలకు వివరణ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇది ప్రాణ రక్షణకు అత్యంత ముఖ్యమని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని పోలీసులు సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ ఉల్లంఘనల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన రహదారుల వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాటు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్



నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల భద్రత కోసం కూడా జాగ్రత్తలు అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

# గాంధీ విగ్రహం కాలుకు చున్ని కట్టి ఉరి వేసుకున్న యువకుడు..!

**వేద న్యూస్, పోతంగల్ :**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం జల్లపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ సంతోష్ (35) అనే యువకుడు మద్యం మత్తుకు బానిసై తల్లిని, భార్య పిల్లలు వేధింపులకు గురి చేస్తున్నారు. మద్యం కోసం డబ్బులు ఇవ్వకుంటే వారిపై దాడులకు పాల్పడుతున్నారు. గురు వారం సాయంత్రం మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మెడ కోసుకొని ఆత్మహత్యయత్న మునకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. శుక్రవారం మధ్యాహ్నం జల్లపల్లికి వచ్చిన సంతోష్ గాంధీ విగ్రహం వద్ద కూర్చు న్నారు. ఇంటికి రమ్మని తల్లి, భార్య, పిల్లలు కోరినప్పటికీ ఆయన వెళ్లకుండా అక్కడే ఉంటూ శుక్రవారం రాత్రి గాంధీ విగ్రహం కాలుకు చున్ని కట్టి మెడకు చుట్టుకుని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోటగిరి పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.



# బైపాస్‌పై ఆగివున్న లారీని ఢీకొట్టిన కారు..

**వేద న్యూస్ కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ పెద్దపల్లి బైపాస్‌లో బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద ఆగివున్న లారీని ఓ కారు పక్క నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంలో కారు ఒకవైపు భాగం మొత్తం నుజ్జునుజ్జయ్యింది. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు.. మృతులను సయ్యద్ అబ్దుల్ రెహమాన్ (19), సయ్యద్ అతియాబ్ హుస్సేన్ (21)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఎండీ అదునాన్ తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఇక ఎండీ అబ్రార్ కారులో నుంచి దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడని పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 04, 2026

# చింతపండుతో చర్మ సంరక్షణ

- సహజ కాంతికి సులభ చిట్కాలు
- మొటిమలు, మచ్చలకు సహజ పరిష్కారం
- ఫేస్ ప్యాక్స్‌తో మెరుగైన చర్మ కాంతి
- ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి




**వేద న్యూస్ డెస్క్:**

వంటకాలకు పుల్లపుల్లటి రుచిని అందించే చింతపండు, చర్మ సంరక్షణలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మొటిమలు, మచ్చలు తగ్గించడం నుంచి ముఖ కాంతిని పెంచడం వరకు అనేక సౌందర్య ప్రయోజనాలు దీనిలో ఉన్నాయి. ఇంట్లోనే సులభంగా తయారుచేసుకునే కొన్ని ఫేస్ ప్యాక్స్ ద్వారా చర్మాన్ని సహజంగా సంరక్షించుకోవచ్చని సూచిస్తున్నారు. మొటిమల సమస్యతో బాధపడుతున్నవారికి చింతపండు ఫేస్ ప్యాక్ మంచి పరిష్కారంగా ఉపయోగపడుతుంది. చింతపండును వేడి నీటిలో నానబెట్టి గుజ్జు తీసుకుని, అందులో ముల్తానీ మట్టి, రోజ్ వాటర్ కలిపి ముఖానికి అప్లై చేయాలి. కొంతసేపు ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగితే చర్మంపై ఉన్న జిడ్డు, ధూళి తొలగి మొటిమలు తగ్గుముఖం పడతాయి. చర్మ కాంతిని పెంచుకోవాలంటే చింతపండు గుజ్జుకు కొద్దిగా పసుపు కలిపి ఫేస్ ప్యాక్‌గా ఉపయోగించవచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని 20 నిమిషాల తర్వాత కడిగితే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. పసుపులోని గుణాలు చర్మాన్ని శుభ్రపరచి సహజ కాంతిని ఇస్తాయి. బ్లీచింగ్ ప్రభావం కోసం చింతపండు గుజ్జుకు శనగపిండి, అరటిపండు గుజ్జు కలిపి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగితే చర్మం క్లీన్‌గా, కాంతివంతంగా కనిపిస్తుంది. ఇది సహజ బ్లీచ్‌లా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

స్క్రబ్‌గా వాడాలంటే చింతపండు గుజ్జుకు నిమ్మరసం, బేకింగ్ సోడా, పంచదార కలిపి మృదువుగా మసాజ్ చేయాలి. ఇది చర్మంపై ఉన్న మృత కణాలను తొలగించి జిడ్డు తగ్గిస్తుంది. ముఖ్యంగా ఆయిల్ స్కిన్ ఉన్నవారికి ఇది మంచి ప్రయోజనం ఇస్తుంది. టోనర్‌గా ఉపయోగించాలంటే చింతపండు రసానికి టీ డికాక్షన్ కలిపి కాటన్‌తో ముఖానికి రాయాలి. కొంతసేపటి తర్వాత కడిగితే చర్మం తాజాగా మారుతుంది. ఇది సహజ టోనర్‌లా పనిచేస్తుంది. అయితే చింతపండును నేరుగా చర్మానికి రాయడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇతర పదార్థాలతో కలిపి వాడాలి. అలాగే కొందరికి అలర్జీ వచ్చే అవకాశం ఉండటంతో ముందుగా ప్యాచ్ టెస్ట్ చేయడం తప్పనిసరి. అవసరమైతే నిపుణుల సలహా తీసుకుని ఉపయోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని సూచిస్తున్నారు.




# క్యాన్సర్ ప్రమాదం తగ్గించాలంటే.. ఈ ఆహారాలు తప్పనిసరి

**వేద న్యూస్ డెస్క్:**



ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా యువతలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల క్యాన్సర్ ప్రమాదం పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. అయితే రోజువారీ ఆహారంలో కొన్ని పోషక పదార్థాలను చేర్చడం ద్వారా ఈ ప్రమాదాన్ని కొంతవరకు తగ్గించవచ్చని సూచిస్తున్నారు. పర్పుల్ స్వీట్ పొటాటో వంటి ఊదా రంగు గడ్డలు యాంటీ ఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. వీటిలో ఉండే ఆంథోసయనిన్స్ శరీరంలో వాపును తగ్గించి కణాలను రక్షిస్తాయి. పరిశోధనల ప్రకారం ఇవి పెద్ద పేగు క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గించే సామర్థ్యం కలిగి ఉంటాయి. బ్రోకలి స్ప్రౌట్స్, మైక్రోగ్రీన్స్ కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో సల్ఫోరాఫేన్ అనే శక్తివంతమైన సమ్మేళనం అధికంగా ఉండి శరీరంలోని డిటాక్స్ వ్యవస్థను చురుకుగా చేస్తుంది. సాధారణ బ్రోకలీతో పోలిస్తే వీటిలో పోషకాలు అనేక రెట్లు ఎక్కువగా ఉంటాయి. కివీ పండ్లు విటమిన్ సి, ఫైబర్, పాలీఫినాల్స్‌తో నిండి ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ స్థాయిలను పెంచి డీఎన్‌ఏ రక్షణలో సహాయపడతాయి. అలాగే జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. గ్రీన్ టీని రోజువారీ అలవాటులో భాగం చేసుకోవడం కూడా మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఇందులో ఉండే సమ్మేళనాలు ట్యూమర్ పెరుగుదలను అణచే విధంగా పనిచేస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గ్రీన్ టీ తాగే వారిలో క్యాన్సర్ ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. బీన్స్‌ను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన ఫైబర్ లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను మెరుగుపరచి కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోజుకు అవసరమైన ఫైబర్‌లో పెద్ద భాగాన్ని బీన్స్ ద్వారా పొందవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే క్యాన్సర్ నివారణకు ఒక్క ఆహారం సరిపోదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. సమతుల్య ఆహారం, వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, సరైన నిద్ర వంటి అంశాలు కూడా సమానంగా ముఖ్యమని చెబుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా మాత్రమే క్యాన్సర్



# జుట్టు తెల్లబడటం తగ్గించాలా?.. ఇంట్లోనే సహజ చిట్కాలు

**వేద న్యూస్ డెస్క్:**

ప్రస్తుతం చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ బాధిస్తున్న సమస్యల్లో జుట్టు తెల్లబడటం ప్రధానంగా మారింది. జీవనశైలి మార్పులు, పోషకాహార లోపం, కాలుష్యం, ఒత్తిడి వంటి కారణాల వల్ల ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే ఇంట్లో సులభంగా లభించే కొన్ని పదార్థాలతో ఈ సమస్యను కొంతవరకు నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఉసిరికాయలు జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఉసిరి రసం తాగడం వల్ల జుట్టు తెల్లబడడం తగ్గడమే కాకుండా జుట్టు రాలడం, చివర్లు చిట్లడం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. ఇందులో ఉన్న పోషకాలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహించి, కేశాలను బలంగా ఉంచుతాయి.


ఉసిరికాయలను నీటిలో నానబెట్టి, అందులో నీలగిరి తైలం కలిపి రాత్రంతా ఉంచాలి. మరుసటి రోజు అందులో నిమ్మరసం, పెరుగు, గుడ్డు కలిపి తలకు ప్యాక్‌లా అప్లై చేయాలి. 1520 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. కరివేపాకును మెత్తగా చేసి అందులో పెరుగు కలిపి జుట్టుకు పట్టిస్తే కేశాలు బలపడతాయి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి కొంతసేపు ఉంచి తలస్నానం చేస్తే జుట్టు నల్లగా, ఆరోగ్యంగా మారుతుంది. ఇది పూర్వకాలం నుంచి ఉపయోగిస్తున్న సహజ పద్ధతి.

జామ ఆకులను మెత్తగా చేసి తలకు పట్టించడం ద్వారా కూడా జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే కొబ్బరినూనెలో నిమ్మరసం కలిపి మర్దన చేయడం వల్ల కేశాలకు పోషణ అందుతుంది. స్కాల్ప్ ఆరోగ్యంగా ఉండి జుట్టు నెమ్మదిగా నల్లబడే అవకాశాలు పెరుగుతాయి. ఇవేకాక ఆముదం, వేపనూనె, ఉసిరిపొడి, బాదం నూనె, శీకాకాయ వంటి పదార్థాలు కూడా జుట్టు సంరక్షణలో కీలకంగా పనిచేస్తాయి. ఇవి కేశాలను బలంగా ఉంచి, తెల్లబడే వేగాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే ఈ చిట్కాలు సహజమైనవే అయినప్పటికీ ప్రతి ఒక్కరికి ఒకే విధంగా పనిచేయవు. కాబట్టి ముందుగా పరీక్షించి ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు.



# తగ్గిపోతున్న సహనం.. పెరుగుతున్న ఆవేశం

- చిన్న విషయాలకు పెద్ద గొడవలు
- డిజిటల్ జీవనశైలి ప్రభావం స్పష్టంగా
- కోప నియంత్రణకు నిపుణుల సూచనలు

**వేద న్యూస్ డెస్క్:**

సమాజంలో సహనం తగ్గిపోతూ, ఆవేశం పెరుగుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్న విషయాలకు పెద్ద గొడవలు, క్షణిక కోపంతో జరిగే దారుణాలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కుటుంబాల్లోనే తీవ్రమైన ఘర్షణలు చోటుచేసుకోవడం, క్షణిక ఆవేశంతో అపరాధాలకు పాల్పడటం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. నిపుణుల ప్రకారం, ఆధునిక జీవనశైలి ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా మారింది. ఒక క్లిక్‌తో ఆహారం, ఒక టచ్‌తో సమాచారం, ఒక స్క్రోల్‌తో వినోదం అందుబాటులోకి రావడంతో మనిషి వెంటనే ఫలితాలను ఆశించే అలవాటు పెరిగింది. ఏ చిన్న ఆలస్యమైనా అసహనానికి దారితీస్తోంది. ఓపిక అనేది అవసరం లేని ఆలస్యమనే భావన బలపడుతోంది. కార్యాలయ ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, కుటుంబ బాధ్యతలు, భవిష్యత్తుపై అనిశ్చితి, ఫోన్ నోటిఫికేషన్లుఈ అన్ని అంశాలు కలిపి మనసును ఎప్పుడూ ఒత్తిడిలో ఉంచుతున్నాయి. ఫలితంగా చిన్న విషయాలకే పెద్ద కోపం బయటపడుతోంది. మనసుకు విశ్రాంతి లేకపోవడం కూడా అసహనాన్ని పెంచుతోందని నిపుణులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో కనిపించే ఇతరుల విజయాలు, సంతోషాలు కూడా మనలో పోలికలను పెంచుతున్నాయి. దీంతో అసంతృప్తి, అసహనం పెరుగుతుంది. అలాగే వినే అలవాటు తగ్గిపోవడం వల్ల పరస్పర అవగాహన తగ్గి, గొడవలు పెరుగుతున్నాయి. ఎదుటివారి మాట పూర్తిగా వినకుండానే స్పందించడం సమస్యలను మరింత తీవ్రమయ్యేలా చేస్తోంది. సహనం తగ్గితే సంబంధాలు దెబ్బతింటాయి. కుటుంబం, స్నేహాలు, బంధుత్వాలు దూరమవుతాయి. తొందరపాటు నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడి, జీవితంపై చిరాకు పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కోపాన్ని నియంత్రించుకోవడం సాధ్యమేనని నిపుణులు సూచిస్తున్నారు. కోపం వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా కనీసం ఐదు సెకన్లు ఆగడం, లోతుగా శ్వాస తీసుకోవడం ఉపయోగపడుతుంది. నాలుగు సెకన్లు లోపలికి, నాలుగు సెకన్లు ఆపి, నాలుగు సెకన్లు బయటకు వదిలే శ్వాస వ్యాయామం మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. రోజూ కొద్దిసేపు ధ్యానం, ప్రాణాయామం చేయడం వల్ల మనసుకు శాంతి లభిస్తుంది. సరైన నిద్ర, సమతుల్య ఆహారం, శారీరక విశ్రాంతి కూడా సహనాన్ని పెంచుతాయి. ప్రతి ఒక్కరూ మనలాగే ఉండరని అర్థం చేసుకోవడం, ప్రతి విషయం అంత ముఖ్యమా అని ఆలోచించడం ద్వారా కోపాన్ని తగ్గించుకోవచ్చు. సహనం అంటే కేవలం ఎదురుచూడడం కాదు.. పరిస్థితిని అర్థం చేసుకునే శక్తి, మనసును నియంత్రించుకునే సామర్థ్యం. ఈ గుణాన్ని పెంపొందించుకుంటేనే వ్యక్తిగత జీవితం, కుటుంబ సంబంధాలు, సమాజం ఆరోగ్యంగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

వేద న్యూస్
శనివారం ఏప్రిల్ 04, 2026

# ఐపీఎల్ మ్యాచ్‌లు పెంపు?



వేద న్యూస్ డెస్క్:

ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన టోర్న మెంట్‌లలో ఒకటైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ను మరింత విస్తరించే దిశగా కీలక చర్చలు జరుగు తున్నాయి. టోర్న మెంట్‌లో మ్యాచ్‌ల సంఖ్యను పెంచే అంశంపై అరుణ్ ధుమాల్ ముఖ్య వ్యాఖ్యలు చేశారు. ఒక స్పోర్ట్స్ చానల్‌తో మాట్లాడిన ఆయన, భవిష్యత్తులో ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్యను ప్రస్తుత 74 నుంచి 94కు పెంచే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. టీ20 క్రికెట్‌పై అభిమానుల ఆసక్తి రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని ఆలోచిస్తున్నామని చెప్పారు. మ్యాచ్‌ల సంఖ్య పెరిగితే ప్రతి జట్టు ఇతర జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తుందని ఆయన వివరించారు. దీంతో లీగ్ మరింత పోటీతో కూడినదిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఒక్కో జట్టు కొన్ని జట్లతో రెండుసార్లు, మరికొన్ని జట్లతో ఒక్కసారి మాత్రమే తలపడుతోంది. ఇటీవల కాలంలో ద్వైపాక్షిక సిరీస్‌లపై ఆసక్తి తగ్గుతూ ఉండటాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తమ స్వంత టీ20 లీగ్‌లను నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇంగ్లాండ్‌లో 'ది హండ్రెడ్', ఆస్ట్రేలియాలో 'బిగ్ బాష్', యూఏఈలో అంతర్జాతీయ టీ20 లీగ్, దక్షిణాఫ్రికాలో ఎస్‌ఏ20 వంటి టోర్నమెంట్‌లు దీనికి ఉదాహరణలని పేర్కొన్నారు. మ్యాచ్‌ల సంఖ్యను 94కు పెంచితే ప్రతి జట్టు సీజన్‌లో సుమారు 18 మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంటుందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. దీంతో అభిమానులకు మరింత వినోదం, ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఐపీఎల్‌ను మరింత విస్తరించేందుకు బీసీసీఐ చేస్తున్న ఈ కసరత్తు, రాబోయే సీజన్‌లలో టోర్నమెంట్ రూపురేఖలను పూర్తిగా మార్చే అవకాశం కనిపిస్తోంది.


# శాంసన్‌కు పసుపు పరీక్ష



వేద న్యూస్ డెస్క్:

సంజూ శాంసన్ ఐపీఎల్ 2026లో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతూ కఠిన పరీక్షను ఎదుర్కొంటున్నాడు. భారీ అంచనాల మధ్య పసుపు జెర్సీతో మైదానంలోకి దిగిన సంజూ తొలి మ్యాచ్‌లో నిరాశపరిచాడు. మహేంద్ర సింగ్ ధోనీ వారసత్వాన్ని కొనసాగిస్తాడని అభిమానులు ఆశించినప్పటికీ, ఆ నమ్మకాన్ని నిలబెట్టలేకపోయాడు. తొలి మ్యాచ్‌లోనే త్వరగా ఔటవడంతో జట్టుకు పెద్ద దెబ్బ తగిలింది. ప్రత్యర్థి బౌలర్ వేసిన బంతిని అంచనా వేయడంలో విఫలమైన సంజూ, క్లీన్బౌల్డ్‌గా వెనుదిరిగాడు. దీంతో స్టేడియంలో ఉన్న అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే, ఈ వైఫల్యాన్ని మరచి రెండో మ్యాచ్‌లో బలంగా పుంజుకోవాలని సంజూ కసితో ఉన్నాడు. ప్రస్తుతం పంజాబ్‌పై జరగబోయే మ్యాచ్‌లో సంజూ తన మార్క్ బ్యాటింగ్‌తో జట్టుకు కీలక పాత్ర పోషించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. నెట్స్‌లో కఠినంగా శ్రమిస్తూ తన ఫామ్‌ను కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నాడు. అయితే అతనికి స్పిన్ బౌలింగ్ నుంచి ముప్పు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో సంజూ పలుమార్లు ఔటవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి జట్టు అతనిపై స్పిన్ ఆయుధాన్ని ప్రయోగించే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లో సంజూ అద్భుత ప్రదర్శన చేశాడు. వరుసగా అర్ధ శతకాలతో జట్టును గెలిపిస్తూ తన సత్తా చాటాడు. కీలక మ్యాచ్‌లలోనూ ఒత్తిడిని తట్టుకుని మంచి స్కోర్లు నమోదు చేశాడు. అదే ఫామ్‌ను ఐపీఎల్‌లో కూడా కొనసాగించాలని అతడు భావిస్తున్నాడు. ధోనీ గాయం కారణంగా కొంతకాలం జట్టుకు దూరంగా ఉండే పరిస్థితి నెలకొనడంతో, వికెట్‌కీపర్‌గా, బ్యాటర్‌గా జట్టును ముందుండి నడిపే బాధ్యత సంజూపైనే ఉంది. ఈ నేపథ్యంలో రెండో మ్యాచ్‌లో అర్ధ శతకంతో చెలరేగి తనపై ఉన్న ఒత్తిడిని తగ్గించుకోవాలని చూస్తున్నాడు. మొత్తంగా చూస్తే, పసుపు జెర్సీలో సంజూ శాంసన్‌కు ఇది కీలక సమయం. ఈసారి తన ప్రతిభను నిరూపించుకుంటేనే అతను నిజంగా ధోనీకి వారసుడిగా నిలుస్తాడని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అవకాశాల కోసం ముంబై వీడిన అర్జున్ టెండూల్కర్



వేద న్యూస్ డెస్క్:

ఐపీఎల్ 2026 సీజన్‌లో కొత్త జట్టుతో ఆడుతున్న యువ ఆల్‌రౌండర్ అర్జున్ టెండూల్కర్ తన కెరీర్‌కు సంబంధించిన కీలక నిర్ణయం వెనుక ఉన్న కారణాన్ని వెల్లడించాడు. గతంలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన అర్జున్, ఈసారి ఎక్కువ అవకాశాలు దక్కాలనే ఆశతో జట్టును విడిచినట్లు తెలిపాడు. ప్రస్తుతం అతడు లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో కొనసాగుతున్నాడు. ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అర్జున్, ప్రతి ఆటగాడికి మైదానంలో ఆడే అవకాశం ఎంతో ముఖ్యమని చెప్పాడు. బెంచ్‌పై కూర్చోవడం తనకు నచ్చదని, మ్యాచ్‌లలో ఆడుతూ తన ప్రతిభను నిరూపించుకోవాలనే కోరికతోనే ముంబై జట్టును విడిచానని స్పష్టం చేశాడు. అవకాశం వచ్చినప్పుడు అత్యుత్తమ ప్రదర్శన చేయడం ప్రతి ఆటగాడి బాధ్యత అని పేర్కొన్నాడు. అలాగే ఐపీఎల్‌లో అమలులో ఉన్న 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై కూడా అర్జున్ స్పందించాడు. ఈ నియమం కారణంగా ఆల్‌రౌండర్లకు అవకాశాలు తగ్గుతున్నాయని, అందుకే తాను వ్యక్తిగతంగా ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నానని తెలిపాడు. ఇతర దేశాల లీగ్‌లలో లేదా అంతర్జాతీయ టీ20ల్లో ఈ నియమం లేకపోవడం కూడా దీనికి కారణమని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుత సీజన్‌లో తన ప్రదర్శనపై కూడా అర్జున్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయినా, రాబోయే మ్యాచ్‌ల్లో మంచి ప్రదర్శనతో జట్టుకు విజయాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. లక్నో జట్టు మిడిలార్డర్ బలంగా ఉందని, టోర్నమెంట్‌లో ముందుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని అతడు విశ్వాసం వ్యక్తం చేశాడు. మొత్తంగా చూస్తే, ఎక్కువ అవకాశాలు పొందేందుకు జట్టును మార్చిన అర్జున్ టెండూల్కర్, ఈ సీజన్‌లో తనను తాను నిరూపించుకోవాలని కృతనిశ్చయంతో ఉన్నాడు.

# రోహిత్ రికార్డులు అజేయం



వేద న్యూస్ డెస్క్:

టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ పేరు వినగానే అభిమానులకు గుర్తొచ్చేది అతడి విధ్వంసకర బ్యాటింగ్. బంతి బ్యాట్‌కు తగిలితే చాలు.. అది బౌండరీ దాటాల్సిందే అన్నట్టుగా ఆడే ఈ హిట్‌మ్యాన్, తన కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన రికార్డులు సృష్టించాడు. ఆ రికార్డులు కేవలం గణాంకాలే కాదుడ క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మైలురాళ్లు. ప్రస్తుతం ఉన్న ఆటగాళ్లకే కాదు, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలకు కూడా ఇవి చేరుకోవడం చాలా కష్టమనే అభిప్రాయం క్రీడా ప్రపంచంలో వినిపిస్తోంది. రోహిత్ కెరీర్ ఆరంభం అంత గొప్పగా ఉండలేదు. మధ్యమధ్యలో అవకాశాలు వచ్చినా వాటిని పూర్తిగా వినియోగించుకోలేకపోయాడు. కానీ ఓపెనర్‌గా ప్రమోట్ అయిన తర్వాత అతడి ఆటతీరు పూర్తిగా మారిపోయింది. తన సహజమైన టైమింగ్, పేషన్స్, మరియు అటాకింగ్ స్టైల్‌తో ప్రపంచంలోని అగ్రశ్రేణి బౌలర్లను సైతం చిత్తు చేశాడు. ఆ తరువాత నుంచి అతడు వెనక్కి తిరిగి చూసిన సందర్భాలే లేవు. అతడి అత్యంత గొప్ప ఘనతల్లో ఒకటి వన్డేల్లో 264 పరుగుల అత్యధిక వ్యక్తిగత స్కోరు. 2014లో శ్రీలంకపై ఆడిన ఆ ఇన్నింగ్స్‌లో మొదట నెమ్మదిగా ప్రారంభించిన రోహిత్, తరువాత తన అసలైన రూపాన్ని బయటపెట్టాడు. సెంచరీ పూర్తి చేసిన తర్వాత గేర్ మార్చి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఒక్కో ఓవర్‌లో బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివరకు 264 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ప్రపంచ రికార్డును సృష్టించాడు. ఈ రికార్డు ఇప్పటికీ ఎవరూ చేరుకోలేని స్థాయిలో ఉంది. వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా రోహిత్ చరిత్ర సృష్టించాడు. ఒక డబుల్ సెంచరీ చేయడం చాలా అరుదైన విషయం. అలాంటిది మూడుసార్లు సాధించడం అతడి క్లాస్‌ను తెలియజేస్తుంది. ఆధునిక క్రికెట్ వేగం పెరిగినా, మ్యాచ్‌లు పెరిగినాడ ఈ రికార్డును అధిగమించడం చాలా కష్టమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఐపీఎల్‌లో కూడా రోహిత్ విజయగాథ అద్భుతమే. ముంబై ఇండియన్స్‌కు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జట్టును ఎన్నోసార్లు విజేతగా నిలిపాడు. ఒత్తిడి పరిస్థితుల్లో కూడా చల్లగా ఆలోచించి సరైన నిర్ణయాలు తీసుకోవడం అతడి ప్రత్యేకత. మొత్తం ఐదు టైటిళ్లు గెలుచుకున్న ఆటగాడిగా ఐపీఎల్ చరిత్రలో అతడు అగ్రస్థానంలో నిలిచాడు. కెప్టెన్సీ, బ్యాటింగ్ రెండింటిలోనూ సమతౌల్యం చూపించిన అరుదైన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ప్రపంచకప్ వేదికపై కూడా రోహిత్ తన సత్తా చాటుకున్నాడు. ముఖ్యంగా 2019 ప్రపంచకప్‌లో అతడు చేసిన ప్రదర్శన అసాధారణం. ఒకే టోర్నీలో ఐదు సెంచరీలు సాధించడం ఇప్పటికీ ఎవరికీ అందని ఘనత. ప్రతి మ్యాచ్‌లోనూ జట్టుకు బలమైన ఆరంభం ఇచ్చి, కీలక సమయంలో బాధ్యత తీసుకుని ఆడిన విధానం అతడిని ప్రపంచస్థాయి బ్యాటర్‌గా నిలబెట్టింది. టి20 ఫార్మాట్‌లోనూ రోహిత్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. నాలుగు సెంచరీలు సాధించిన ఆటగాడిగా అతడు ప్రత్యేక రికార్డు నెలకొల్పాడు. సాధారణంగా టీ20ల్లో పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడటం కష్టం. కానీ రోహిత్ మాత్రం ఆ ఫార్మాట్‌లోనూ భారీ స్కోర్లు చేయగలడని నిరూపించాడు. అతడి టైమింగ్, షాట్ సెలక్షన్, ప్రెషర్ హ్యాండ్లింగ్ఖశ్రీశ్రీ కలిసి అతడిని పూర్తి స్థాయి బ్యాటర్‌గా మార్చాయి. రోహిత్ రికార్డులు ఎందుకు అజేయంగా నిలుస్తున్నాయంటేడ అవి కేవలం టాలెంట్ వల్లే కాదు. కష్టపడి సాధించినవి, అనుభవంతో మెరుగుపరుచుకున్నవి, ఒత్తిడిని జయించి సాధించినవి. ప్రతి ఇన్నింగ్స్ వెనుక ఉన్న పట్టుదల, ప్రతిసారి తిరిగి లేచి నిలబడే తత్వం అతడిని ఈ స్థాయికి తీసుకువచ్చాయి. మొత్తానికి, రోహిత్ శర్మ క్రికెట్ కెరీర్ ఒక ప్రేరణాత్మక ప్రయాణం. అతడు సాధించిన ఈ ఐదు రికార్డులు భవిష్యత్తులో ఎవరైనా బద్దలు కొట్టడం చాలా కష్టం. కొత్త ఆటగాళ్లు వస్తారు, రికార్డులు మారుతాయిడ కానీ 'హిట్‌మ్యాన్' సృష్టించిన ఈ చరిత్ర మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# ధోనీ రీఎంట్రీపై ఆసక్తి



వేద న్యూస్ డెస్క్:

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగబోయే కీలక మ్యాచ్‌కు ముందు మహేంద్ర సింగ్ ధోనీ అందుబాటుపై ఆసక్తి నెలకొంది. కండరాల నొప్పితో బాధపడుతున్న ధోనీ ఈ మ్యాచ్‌లో ఆడతాడా లేదా అన్నది అభిమానుల్లో చర్చనీయాంశమైంది. వైద్యులు కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని సూచించినప్పటికీ, ఇటీవల ధోనీ సాధనలో పాల్గొనడం అభిమానులకు ఆశను కలిగిస్తోంది. జట్టు ప్రదర్శన దృష్ట్యా అతను మళ్లీ బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇటీవల మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన చెన్నై జట్టు తిరిగి పుంజుకోవాలని చూస్తోంది. జట్టుకు అనుభవం, మార్గదర్శకత్వం అవసరమైన సమయంలో ధోనీ పాత్ర కీలకమవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. మ్యాచ్ సమయానికి అతని ఫిట్‌నెస్‌పై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ధోనీ బరిలోకి దిగితే ఈ పోరు మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉంది.

# డసెన్ వీడ్కోలు




వేద న్యూస్ డెస్క్:

దక్షిణాఫ్రికా జట్టుకు కీలక బ్యాటర్‌గా నిలిచిన రస్సీ వాన్ డెర్ డసెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ, జట్టు, సహచరులు, కోచ్‌లు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. సామాజిక మాధ్యమం వేదికగా భావోద్వేగ సందేశం పంచుకున్న డసెన్, దేశ జెర్సీ ధరించడం తన జీవితంలో గొప్ప గౌరవమని పేర్కొన్నాడు. ఈ ప్రయాణం తన పట్టుదలను పరీక్షించడమే కాకుండా ఎన్నో మధుర జ్ఞాపకాలను ఇచ్చిందని తెలిపాడు 2018 అక్టోబర్‌లో అంతర్జాతీయ టి–ఇరవైల్లో అడుగుపెట్టిన డసెన్, ఆ తర్వాత వన్డే, టెస్టు రూపాల్లోనూ జట్టుకు సేవలందించాడు. వన్డేల్లో ముఖ్యంగా స్థిరమైన ప్రదర్శనతో జట్టుకు కీలక ఆటగాడిగా ఎదిగాడు. అరంగేట్ర వన్డేలోనే అధిక స్కోరు నమోదు చేసి గుర్తింపు పొందాడు. తన కెరీర్‌లో మొత్తం వన్డేలు, టెస్టులు, టి–ఇరవైల్లో కలిపి వేల పరుగులు సాధించిన డసెన్, ప్రపంచకప్ పోటీల్లో కూడా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతానని, భవిష్యత్తులో కోచ్‌గా కొత్త బాధ్యతలు స్వీకరించే ఆలోచన ఉందని వెల్లడించాడు.

# ధోనీ, కపిల్‌లకు యువీ క్షమాపణ



వేద న్యూస్ డెస్క్:

భారత క్రికెట్‌కు చెందిన ప్రముఖులు కపిల్ దేవ్, మహేంద్ర సింగ్ ధోనీలకు మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. తన తండ్రి యోగ్‌రాజ్ సింగ్ గతంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. యోగ్‌రాజ్ సింగ్ పలుమార్లు ధోనీపై విమర్శలు చేస్తూ యువరాజ్ కెరీర్‌పై ప్రభావం చూపినట్లు ఆరోపించగా, కపిల్ దేవ్‌పై కూడా గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు వివాదానికి దారితీసిన నేపథ్యంలో యువరాజ్ స్పందిస్తూ, ఆ మాటలు తనకు కూడా బాధ కలిగించాయని వెల్లడించారు. తన తండ్రితో ఈ విషయంపై మాట్లాడినట్లు తెలిపిన యువరాజ్, అలాంటి వ్యాఖ్యలు సరైనవి కావని సూచించానని అన్నారు. జరిగిన పరిణామాలపై విచారం వ్యక్తం చేస్తూ, ఇద్దరు దిగ్గజ క్రికెటర్లకు క్షమాపణలు తెలియజేశారు. భారత క్రికెట్‌లో కీలక పాత్ర పోషించిన ఈ ఇద్దరు మాజీ కెప్టెన్లపై వచ్చిన వ్యాఖ్యలపై అభిమానుల్లో చర్చ నడుస్తున్న వేళ, యువరాజ్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 04, 2026

# ఇరవై ఏళ్లుగా అగ్రతారగా నయనతార విజయ గాథ

**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణాది సినీ పరిశ్రమలో లేడీ సూపర్ స్టార్‌గా ఖ్యాతి పొందిన నయనతార గత రెండు దశాబ్దాలుగా అగ్రహీరోయిన్‌గా తన స్థానాన్ని దృఢంగా నిలబెట్టుకుంటూ అరుదైన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. సినీరంగంలోకి అడుగుపెట్టి ఇరవై సంవత్సరాలకు పైగా గడిచినా, ఇప్పటికీ కథానాయికగా ప్రధాన పాత్రలతో వరుస అవకాశాలు అందుకుంటూ తన స్టార్‌డమ్‌ను మరింత బలపరుచుకుంటోంది. తనతో పాటు వచ్చిన అనేకమంది హీరోయిన్లు వివాహం లేదా అవకాశాల కొరత కారణంగా వెనుకబడి పోయినప్పటికీ, నయనతార మాత్రం ప్రతి దశలోనూ తనను తాను కొత్తగా నిరూపించుకుంటూ ముందుకు సాగింది. వ్యక్తిగత జీవితంలో దర్శకుడు విఘ్నేష్ శివన్తో వివాహం చేసుకుని, కవల పిల్లలకు తల్లిగా మారిన తర్వాత కూడా కెరీర్‌పై ఏమాత్రం రాజీ పడకుండా సమతుల్యంగా ముందుకు సాగుతోంది. నయనతార విజయానికి ప్రధాన కారణం ఆమె కథల ఎంపికలో చూపే అపారమైన జాగ్రత్త. కేవలం గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, కథలో బలం ఉంటే ఏ పాత్రకైనా సిద్ధమవుతుంది. ముఖ్యంగా మహిళా ప్రధాన పాత్రలు, శక్తివంతమైన అధికారిణి పాత్రలు, యాక్షన్ నేపథ్యంలో వచ్చే పాత్రల్లో ఆమె చూపే నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. పాత్ర కోసం తన శరీర భాష, భావప్రకటనలను మార్చుకుని పూర్తి స్థాయిలో అంకితభావంతో నటించడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. దక్షిణాది చిత్రాలతో పాటు, ఇటీవల బాలీవుడ్‌లో కూడా అడుగుపెట్టి తన పరిధిని మరింత విస్తరించింది. జవాన్ చిత్రంలో షారుక్ ఖాన్తో కలిసి నటించి భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ద్వారా ఉత్తర భారత ప్రేక్షకుల్లో కూడా మంచి గుర్తింపును సంపాదించింది. దీంతో ఆమె కెరీర్‌కు కొత్త దిశ లభించింది. ఇక నయనతార కెరీర్‌లో మరో ముఖ్యమైన అంశం కొత్తదనం కోసం నిరంతరం ప్రయత్నించడం. ప్రతి సినిమా ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతి ఇవ్వాలని ఆమె ప్రయత్నిస్తుంది. ఇదే కారణంగా ప్రేక్షకుల్లో ఆమెపై ప్రత్యేకమైన అభిమాన భావం ఏర్పడింది. దర్శకులు, నిర్మాతలు కూడా కథను నమ్మి ఆమెపై భారీ బాధ్యతలు పెట్టగలగడం దీనికి నిదర్శనం. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, నయనతార విజయ రహస్యం మూడు ప్రధాన అంశాల్లో ఉంది కథల ఎంపికలో ధైర్యం, పాత్రల పట్ల పూర్తి అంకితభావం, మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా తనను తాను మలుచుకోవడం. ఈ లక్షణాల వల్లే ఆమె రెండు దశాబ్దాలుగా అగ్రతారగా నిలిచి, కొత్త తరానికి స్ఫూర్తిగా మారింది. మొత్తంగా చూస్తే, గ్లామర్‌కు పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఇస్తూ, వ్యక్తిగత జీవితంవృత్తి జీవితం రెండింటినీ



సమతుల్యంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న నయనతార, భారతీయ సినీ పరిశ్రమలో అరుదైన స్థానం సంపాదించింది. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో విజయాలను కొనసాగించే సామర్థ్యం ఆమెకు ఉందని అభిమానులు విశ్వసిస్తున్నారు.


# 'రాకాస' రివ్యూ



**వేద న్యూస్ డెస్క్:**

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాణంలో వచ్చిన 'రాకాస' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'కమిటీ కుర్రాళ్లు' విజయానంతరం వచ్చిన ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించగా, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దర్శకత్వం మానస శర్మ వహించగా, సంగీతం అనుదీప్ దేవ్ అందించారు. కథ విషయానికి వస్తే, అమెరికా నుంచి గ్రామానికి వచ్చిన వీరబాబు (సంగీత్ శోభన్) ఒక హత్య కేసులో ఇరుక్కుని, గ్రామంలో ఉన్న భయానక కోటలో రాక్షసుడికి బలి ఇవ్వాలనే పరిస్థితికి చేరుకుంటాడు. ఆ కోటలో నిజంగా రాక్షసుడు ఉన్నాడా? అతను బయటపడ్డాడా? అన్నది కథలో ప్రధాన ఆసక్తి. దర్శకురాలు మానస శర్మ పాతకాలపు ఫాంటసీ కథను ఆధునిక కామెడీతో మిళితం చేస్తూ ఆసక్తికరంగా తెరకెక్కించారు. ఫస్ట్ హాఫ్‌లో కామెడీ బాగా వర్కౌట్ అవుతుంది. సెకండాఫ్‌లో కథ వేగం పెరిగి క్లైమాక్స్ వరకు ఎక్కడా బోర్ అనిపించకుండా సాగుతుంది. ముఖ్యంగా చివర్లో ఎమోషనల్ టచ్ కూడా ఆకట్టుకుంటుంది. నటీనటుల విషయానికి వస్తే, సంగీత్ శోభన్ తన నటనతో సినిమాను ముందుకు నడిపించాడు. కామెడీ టైమింగ్, ఎనర్జీ ఈ సినిమాకు పెద్ద ప్లస్. నయన్ సారిక తన పాత్రలో మెప్పించగా, వెన్నెల కిషోర్‌తో వచ్చిన కామెడీ సన్నివేశాలు థియేటర్లలో నవ్వులు పూయిస్తాయి. బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి అనుభవం సినిమాకు బలం చేకూర్చింది. సాంకేతికంగా కూడా సినిమా మంచి స్థాయిలో ఉంది. అనుదీప్ దేవ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కథకు బాగా సరిపోయింది. కెమెరా వర్క్, నిర్మాణ విలువలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తం మీద 'రాకాస' కొత్త కథ కాకపోయినా, వినోదంతో నింపిన సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా నిలిచింది. లాజిక్స్ పక్కన పెట్టి సరదాగా నవ్వుకోవాలనుకునే వారికి ఈ సినిమా మంచి ఎంపికగా చెప్పొచ్చు.

# స్పీడ్.. థ్రిల్.. ఎమోషన్.. 'బైకర్' మూవీ ఎలా ఉందంటే?




**వేద న్యూస్ డెస్క్:**

వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకులను అలరించే శర్వానంద్ ఈసారి స్పోర్ట్స్ డ్రామా 'బైకర్'తో థియేటర్లలోకి వచ్చారు. మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రం స్పీడ్, భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా రాజశేఖర్ కీలక పాత్ర ఈ సినిమాకు మరింత బలం చేకూర్చింది. కథ వికాస్ నారాయణ్ అలియాస్ విక్కీ (శర్వానంద్) చిన్నప్పటి నుంచే మోటోక్రాస్ రేసింగ్‌లో అగ్రస్థానానికి చేరుకునే ప్రతిభ కలిగిన యువకుడు. అతని తండ్రి సునీల్ నారాయణ్ (రాజశేఖర్) కఠినమైన శిక్షణతో అతన్ని చాంపియన్‌గా తీర్చిదిద్దుతాడు. కానీ అనూహ్యంగా విక్కీ రేసింగ్‌ను వదిలేయడం కథలో ప్రధాన మలుపు. అతను ఎందుకు దూరమయ్యాడు? మాళవిక నాయర్ పోషించిన అనన్య పాత్ర ఏంటి? తండ్రీకొడుకుల మధ్య విభేదాలు ఎలా పరిష్కారమయ్యాయి? చివరికి విక్కీ మళ్లీ ట్రాక్‌పైకి వచ్చాడా? అన్నదే సినిమా కథ. తెలుగు సినిమాల్లో అరుదుగా కనిపించే మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యం ఈ సినిమాకు ప్రధాన బలం. రేసింగ్ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తెరకెక్కాయి. శర్వానంద్ తన పాత్రలో పూర్తిగా లీనమై నటించారు. ఎమోషనల్ సీన్స్‌లోనూ, యాక్షన్‌లోనూ మెప్పించారు. రాజశేఖర్ తన అనుభవంతో పాత్రకు న్యాయం చేసి సినిమాకు గంభీరత తీసుకొచ్చారు. సినిమాటోగ్రఫీ, నేపథ్య సంగీతం కూడా సినిమాను మరింత ఎత్తుకు తీసుకెళ్లాయి. మైనస్ పాయింట్స్ కొన్ని సన్నివేశాలు రొటీన్ స్పోర్ట్స్ డ్రామా తరహాలో ఉండటం వల్ల ముందే ఊహించగలిగేలా అనిపిస్తాయి. ఫస్ట్ హాఫ్ కాస్త నెమ్మదిగా సాగుతుంది. హీరో-హీరోయిన్ల మధ్య భావోద్వేగాలను ఇంకాస్త బలంగా చూపించాల్సింది. సాంకేతిక అంశాలు దర్శకుడు అభిలాష్ రెడ్డి కొత్త కాన్సెప్ట్‌ను ఎంచుకుని దానిని భావోద్వేగాలతో మేళవించడంలో మంచి ప్రయత్నం చేశారు. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. అయితే మొదటి భాగంలో ఎడిటింగ్ ఇంకాస్త కట్టుదిట్టంగా ఉంటే బాగుండేది. తీర్పు మొత్తంగా 'బైకర్' స్పోర్ట్స్ డ్రామా అభిమానులకు మంచి అనుభూతిని ఇచ్చే సినిమా. శర్వానంద్, రాజశేఖర్ నటన, రేసింగ్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. మొదటి భాగం నెమ్మదిగా ఉన్నప్పటికీ, రెండో భాగం భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. స్పోర్ట్స్ సినిమాలు ఇష్టపడే వారికి ఇది ఓసారి తప్పక చూడదగిన చిత్రం.

# మళ్లీ ధనుష్‌తో నటించాలని సంయుక్త ఆకాంక్ష



**వేద న్యూస్ డెస్క్:**

సౌత్ సినీ ఇండస్ట్రీలో వేగంగా ఎదుగుతున్న ప్రతిభావంతురాలైన హీరోయిన్ సంయుక్త మీనన్ మరోసారి ధనుష్తో కలిసి నటించాలని తన మనసులోని కోరికను వెల్లడించారు. వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆమె, కథా ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సంయుక్త, ధనుష్‌తో పని చేసిన అనుభవాన్ని ఎంతో విలువైనదిగా అభివర్ణించారు. సెట్లో ఆయన చాలా ప్రశాంతంగా, తక్కువ మాటలతో ఉండే వ్యక్తి అయినప్పటికీ, కెమెరా ముందు నిలబడగానే పూర్తిగా పాత్రలో లీనమై అద్భుత నటన ప్రదర్శిస్తారని చెప్పారు. ప్రతి సీన్‌ను ఎంతో సహజంగా తీర్చిదిద్దే ఆయన ప్రతిభ తనకు ఎంతో ప్రేరణనిచ్చిందని పేర్కొన్నారు. ఇద్దరూ కలిసి నటించిన సార్ చిత్రం సంయుక్త కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఈ సినిమాలో ఆమె పోషించిన 'మీనాక్షి' పాత్ర ప్రేక్షకుల మన్ననలు పొందింది. విద్యా వ్యవస్థలోని అసమానతలను ప్రతిబింబించిన ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించి, ఆమెకు మరింత గుర్తింపును తెచ్చిపెట్టింది. టాలీవుడ్‌లో భీమ్లా నాయక్ ద్వారా అడుగుపెట్టిన సంయుక్త, అనంతరం బింబిసార, విరూపాక్ష వంటి వరుస హిట్ చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. కథలో ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవడం, తన నటనతో ప్రతి పాత్రకు ప్రాణం పోయడం ఆమెకు ప్రత్యేకమైన ఇమేజ్‌ను తీసుకువచ్చాయి. అందుకే అభిమానులు ఆమెను 'లక్కీ బ్యూటీ'గా పిలుస్తున్నారు. సంజుక్త తన కెరీర్‌ను కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం చేయకుండా, బలమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రతి సినిమాలో కొత్తదనం చూపించాలని ప్రయత్నించడం ఆమె లక్షణం. ఇదే ఆమెను ఇతర హీరోయిన్లతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెడుతోంది. భవిష్యత్తులో మళ్లీ ధనుష్‌తో కలిసి నటించే అవకాశమొస్తే తప్పకుండా ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుంటానని సంయుక్త స్పష్టం చేశారు. తాను కలిసి పని చేయాలనుకునే నటుల జాబితాలో ధనుష్ ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. సరైన కథ, బలమైన పాత్ర దొరికితే ఈ విజయవంతమైన జంట మళ్లీ తెరపై కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, ప్రతిభతో పాటు సరైన నిర్ణయాలతో ముందుకు సాగుతున్న సంయుక్త మీనన్, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఆది సాయికుమార్ 'సైరాబాను' క్లాప్ కొట్టిన కిరణ్ అబ్బవరం!




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ కొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 'సైరాబాను' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం నేడు ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ ప్రారంభ వేడుకకు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, రామ్ అబ్బరాజు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. సీనియర్ నటుడు సాయికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కథా రచనను కోన వెంకట్, జైన్స్ నాని అందించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ఫణి కృష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బాంధవి శ్రీధర్ నటిస్తున్నారు. సంగీతాన్ని శేఖర్ చంద్ర అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను రామ్ రెడ్డి చేపట్టారు. ఎడిటింగ్‌ను ఛోటా కె. ప్రసాద్ నిర్వహిస్తున్నారు. అన్ని హద్దులను చెరిపేసే అందమైన ప్రేమకథగా తెరకెక్కుతున్న 'సైరాబాను' త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు.

# వామ్మో.. ఆ సినిమాకు సీక్వెలా..? హీరోయిన్ షాకింగ్ కామెంట్స్!

**వేద న్యూస్ డెస్క్:**



సౌత్ సినీ పరిశ్రమలో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన యుగానికి ఒక్కడు సినిమాకు సీక్వెల్ రానుందన్న వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని రేపుతున్నాయి. అయితే ఈ నేపథ్యంలో హీరోయిన్ ఆండ్రియా జెర్మియా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. దర్శకుడు సెల్వరాఘవన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో కార్తి, ఆండ్రియా కీలక పాత్రల్లో నటించారు. మొదట బాక్సాఫీస్ వద్ద పెద్దగా సక్సెస్ కాకపోయినా, తరువాత కాలంలో ఈ సినిమా కల్ట్ స్టేటస్‌ను సంపాదించుకుంది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌గా యుగానికి ఒక్కడు 2ను ధనుష్ హీరోగా ప్లాన్ చేస్తున్నారు. అయితే మొదటి భాగంలో 'లావణ్య' పాత్రతో మెప్పించిన ఆండ్రియా, సీక్వెల్‌లో కనిపించే అవకాశాలపై స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఆ సినిమా షూటింగ్ సమయంలో అడవులు, ఎడారుల్లో చాలా కష్టపడ్డాం. అది శారీరకంగా చాలా ఛాలెంజింగ్ అనుభవం. ఇప్పుడు మళ్లీ అలాంటి రిస్క్ తీసుకోవడానికి నేను సిద్ధంగా లేను" అని స్పష్టం చేశారు. ఇంకా మాట్లాడుతూ.. "మొదటి భాగం వచ్చి చాలా సంవత్సరాలు అయ్యాయి. ఇప్పుడు నా వయసు, పరిస్థితులు మారాయి. కేవలం గత గుర్తింపుకోసం మళ్లీ అదే కష్టం పడటం నాకు ఇష్టం లేదు" అని కుండబద్దలు కొట్టారు. అయితే సీక్వెల్‌పై మాత్రం ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ధనుష్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం భారీ విజయాన్ని సాధిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. కానీ ఆండ్రియా ఈ ప్రాజెక్ట్‌లో లేకపోవడం అభిమానులను కొంత నిరాశకు గురిచేస్తోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073